క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడికి పరామర్శ



వయ్యాల కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు, సీనియర్ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డిని శనివారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ జయశ్యామ్, అంకయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధురెడ్డి, నారాయణ, సాధనమున్నా, మునిరాజా, మధుమోహన్ రెడ్డి, గోపిగౌడ్, సుధాకర్‌రెడ్డి, రవి, సందీప్ రెడ్డి, కందాటి మహేష్‌రెడ్డి, ఎండీ పుత్తూరు సర్పంచ్ మోహనప్రియ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



విస్తృత ప్రచారం చేస్తున్న ఎంపీడీఓ

నాగలాపురం: ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పారిశుద్ధ్యం పట్ల శనివారం ఎంపీడీఓ వెంకటరత్నమ్మ గ్రామ ప్రజలకు, దుకాణదారులకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇందుకోసం ప్రభుత్వం అందించిన బుట్టల ద్వారా తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వీధులను, మన చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించి, చెత్త బుట్టలను పంపిణీ చేశారు.

పాఠశాలను విలీనం చేయొద్దు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం విప్పమాను పట్టెడలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఎస్ఎంసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాఠశాల విలీనంపై ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపాధ్యాయురాలు మేరీ పద్మకుమారి తెలిపారు. సమావేశంలో సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకోవడానికి విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. పాఠశాలను విలీనం చేయొద్దని, పాఠశాల అభ్యున్నతికి విద్యాధికారులు సహకరించాలని కోరారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు



ఆశీర్వదిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: స్థానిక వైఎస్సార్‌సీపీ నేత టౌన్ ప్రెసిడెంట్ ఎల్.సురేష్ బామర్ది నేతాజీ పెళ్లి స్థానిక టీఆర్ఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహానికి సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు చిన్నదొరై, అపరంజిరాజు, బాలాజీ రెడ్డి, రాజమానిక్యం, కులశేఖర్ రెడ్డి, మునిరెడ్డి, దేశన్, ధనరాజ్, చిరంజీవి పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం



శివపార్వతుల ఊరేగింపు

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు జ్యోతీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శివపార్వతుల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు చేశారు. బాణసంచా, మంగళవాయిద్యాల నడుమ వసంతోత్సవం కనుల పండువగా జరిగింది. అనంతరం ఆలయ అర్చకులు నిరంజన్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త నంద కుమార్ నాయుడు దంపతులు భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం జెడ్పీ బాలికల పాఠశాల, శ్రీనివాస జూనియర్ కళాశాల, కేఆర్‌సీ జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1451 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటి రోజు 1433 మంది హాజరైనట్లు ఎంఈఓ ఇందిరా దేవి తెలిపారు. కేఆర్‌సీ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పరిశీలించారు. ఆయన వెంట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ సుధాకర్ ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

శివ పార్వతుల కల్యాణ వైభవం



గజ వాహనంపై వస్తున్న శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీకాళహస్తీశ్వరస్వామి మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారు జామున శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. జ్ఞానప్రసూనాంబదేవికి శ్రీకాళహస్తీశ్వరునిచే మాంగల్యధారణ తంతును వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ శుభసమయంలో వందలాది జంటలు పెళ్లిపీటలెక్కాయి. నూతన వధూవరులకు ముక్కంటి ఆలయం తరపున మంగళ సూత్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు.

–శ్రీకాళహస్తి



సింహ వాహనంపై జ్ఞానప్రసూనాంబ



స్వామి అమ్మవార్ల పట్టువస్త్రాలు

నృత్యం అబ్బురం!

శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ధూర్జటి కళాప్రాంగణంలో జరిగిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. పట్టణానికి చెందిన బాలసుబ్రహ్మణ్యం భక్తిరంజనితో కార్యక్రమం మొదలైంది. తిరుపతికి చెందిన కీర్తి, చెన్నైకు చెందిన నీరజా విశ్వనాథన్ నృత్యప్రదర్శనలు, నెల్లూరుకు చెందిన లక్ష్మీ సాయిప్రియ వందన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం హైదరాబాద్‌కు చెందిన అభిరామ్ భక్తిరంజని, ఇబ్రహీం పట్టణానికి చెందిన భవిరి సుభాషిణీ రవి మిమిక్రీ ప్రదర్శన ఆహూతులను అలరించాయి. నెల్లూరుకు చెందిన లక్ష్మీప్రసాద్ ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకంతో శనివారం నాటి కార్యక్రమాలు ముగిశాయి. వీరికి ఆలయ అధికారులు, ప్రశంసాపత్రాలు, ముక్కంటి ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.





నృత్యం చేస్తున్న కళాకారులు





పూజలు చేస్తున్న వేదపండితులు, పురవీధుల్లో ఊరేగుతున్న నటరాజస్వామి, శివకామిసుందరి





తలంబ్రాల ఘట్టం, నూతన వధూవరులకు సారె అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి

మహాశివరాత్రికి ఆర్టీసీకి ఆదాయం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహాశివరాత్రి, రథోత్సవం మరియు కల్యాణోత్సవం రోజుల్లో 1.24 లక్షల కిలోమీటర్ల దూరం నడిచిన ఆర్టీసీ బస్సులు రూ. 55.45 లక్షల ఆదాయం సమకూర్చినట్లు డిపో మేనేజరు మునిచంద్రయ్య తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ గత సంవత్సరం రూ. 50.37 లక్షల ఆదాయం వచ్చినట్లు వివరించారు. ఇందుకు సహకరించిన డిపోలోని సిబ్బందికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేయడం జరిగినది.



డీఎం మునిచంద్రయ్య

భారతీయ సంస్కృతిని పిల్లలకు తెలియజేయాలి



వాంపల్లిలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున్న స్థానికులు

రేణిగుంట: ఎంతో గొప్పదైన భారతీయ సాంస్కృతిక విలువలను యువతకు తెలియజేయాలని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని పోలి పంచాయతీ పరిధిలో వాంపల్లెలో బాల త్రిపుర సుందరి సమేత కేదారేశ్వర స్వామి ఆలయంలో శనివారం శివపార్వతుల కల్యాణోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, స్థానికులు ఆయనకు మంగళ వాయిద్యాలు నడుమ ఘన స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్ల కుంకుమ తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఏడాది నిర్వహించడం వలన రాబోయే తరానికి పండుగల విశిష్టత తెలుస్తుందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో స్థానికుల అభ్యర్థన మేరకు ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించామని, ప్రస్తుతం రూ.రెండు కోట్ల వ్యయంతో స్థానికులు ఆలయాన్ని నిర్మించుకోవడం శుభపరిణామమని చెప్పారు. వెంకటేశ్వర నాయుడు, కుమార్ నాయుడు, చంద్ర వరప్రసాద్ చౌదరి, చెంచయ్య నాయుడు, ఈశ్వరయ్య నాయుడు, పోలి గుణ, సుధాకర్, దయాకర్ యాదవ్, రేపల్లి మల్లికార్జున్ మొదలియార్, మనోహర్ రెడ్డి, సురేంద్ర యాదవ్, నాగరాజు రెడ్డి, శివకుమార్, నక్క పెంచలయ్య, నరేష్ రెడ్డి, భీమవరం శివ, సుబ్బరాయులు, కోటి, రెడ్డమ్మ, జయరామయ్య యాదవ్, చెంచయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు భూమిలేదు.. పిల్లలకు ఉద్యోగాలు రావు




మాట్లాడుతున్న సర్పంచ్ నాగూరు

నారాయణవనం: సారా తయారీకి దూరంగా ఉంటూ స్వయం ఉపాధి దిశగా మార్పు చెందితే పాత కేసులను దశలవారీగా మాఫీ చేయిస్తామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిసనర్ శ్రీనివాస ఆచారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ తెలిపారు. మండలంలోని తిరువట్యంలో శనివారం సాయంత్రం ఎక్సైజ్ శాఖ సారాపై నవోదయం 2.0 సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అటవీశాఖ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో వారు మాట్లాడుతూ సారాతో అనారోగ్య సమస్యలతో పాటు కుటుంబాలు వీధిన పడుతున్నాయని అన్నారు. సారా తయారీ, అమ్మకాలను పూర్తిగా మానేస్తే, పాత కేసులను దశలువారిగా కొట్టేయడమే కాకుండా కలెక్టర్ సహకారంతో చదువుకున్న యువతకు శ్రీసిటీలో ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, స్వయం ఉపాధికి బ్యాంకుల నుంచి రుణాలను మంజూరు చేయిస్తామని అన్నారు.

ఉద్యోగాలు రాక.. కోర్టుల చుట్టూ తిరుగుతూ..

సర్పంచ్ నాగూరుతో పాటు గ్రామ పెద్దలు సారకాయలు, తిరువేంగడం మాట్లాడుతూ గతంలోనూ సమావేశాలు నిర్వహించిన అధికారులు తమ హామీలను నిలుపుకోలేక పోయారని తెలిపారు. 65 సంవత్సరాల రెవెన్యూ, ఫారెస్ట్ బఫర్ భూముల్లో వ్యవసాయానికి ఇచ్చిన భూములపై ఫారెస్ట్ అధికారులు అడ్డు తగులుతున్నారని వాపోయారు. సారా ఆపేసిన వారికి సాగు చేయడానికి భూమి లేక, చదువుకున్న యువతకు ఉద్యోగాలు రాలేకుంటే ఏం పని చేసుకుని బతకాలంటూ ప్రశ్నించారు. ఎప్పుడో పెట్టిన ఎక్సైజ్ కేసులకు కోర్టుల చుట్టూ తిరుగుతుంటే మార్పు ఎలా వస్తుందని పశ్నించారు. స్పందించిన శ్రీనివాస ఆచారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చివరిగా సారా తయారీకి, విక్రయాలకు దూరంగా ఉంటామని, స్వయం ఉపాధిపై దృష్టి పెట్టి గౌరవంగా జీవిస్తామని గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐలు అంజద్‌బాషా, శివప్రసాద్, ఫారెస్ట్ రేంజర్ మాధవి, ఏఎస్ఐలు జయరాం నాయక్, గోపి, ఉప సర్పంచ్ చీరాలయ్య, కార్యదర్శులు కిషోర్, తిరుమలయ్య, వీఆర్ఓ బాలరాజ్, గ్రామస్తులు, మహిళలు తదితరుల పాల్గొన్నారు.

మాదిగల అమర వీరులకు నివాళి



అరుంధతివాడలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వరదయ్యపాళెం: ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనలో అశువులు బాసిన మాదిగ అమర వీరులకు నివాళులు అర్పిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిపట్టు రాఘవయ్య తెలిపారు. శనివారం రాత్రి చిన్నపాండూరు అరుంధతివాడలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నీరుపాక దొరబాబు ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మాదిగల అమర వీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సత్యవేడు నియోజకవర్గ కన్వీనర్ గౌరి భాస్కర్, కుమార్, ధనశేఖర్, సుధాకర్, ఢిల్లీ, మధు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ రక్షణ



మొక్కలు నాటుతున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: చెట్ల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మహిళా శిశు సంక్షేమం ఆధ్వర్యంలో జరిగిన కిశోర బాలికల బచావో, బేటీ పడావో కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చెట్లను పెంచవలసిన అవసరం ఉందన్నారు. చెట్లు లేకపోవడం వల్లే వర్షాలు పడడం లేదని, ఎండవేడిమి ఎక్కువ ఉందన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా చెట్లను పెంచాలని కోరారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన, చేసిన జైలు తప్పదని, బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యమున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందుకుంటున్న ముస్లిం మైనారిటీ కుటుంబాలు


వరదయ్యపాళెం: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం మైనారిటీలకు చేయూత ఇచ్చేందుకు ఎన్ఆర్ఐ షేక్‌బాబు నూరుద్దీన్ ముందుకొచ్చారు. ఆ మేరకు వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ పరిధిలోని గోవర్ధనపురం, పద్మావతిపురం, లక్ష్మీపురం గ్రామాల్లోని 100 మంది ముస్లిం మైనారిటీ కుటుంబాలకు శనివారం గోవర్ధనపురం మసీదు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మైనారిటీ సెల్ నాయకుడు షేక్‌అబ్దుల్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం బస్తా, కేజీ గోధుమ పిండి, కూరగాయలు, సేమియా, వంట నూనెను వితరణగా అందజేశారు. పండుగ సందర్భంగా ఎన్ఆర్ఐ షేక్‌బాబు నూరుద్దీన్ సేవలను ముస్లిం మైనారిటీ కుటుంబాలు కొనియాడారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద హన్సిక

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో వెండి అంబారీ దాత బాలసుబ్రహ్మణ్యం మలాడి కుటుంబ సమేతంగా ప్రముఖ సినీనటి హన్సిక ఉన్నారు. దక్షిణగోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బాలసుబ్రహ్మణ్యం మలాడికి జ్ఞాపిక అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

భక్తుల సేవలో రోవర్లు, రేంజర్లు



స్కౌట్ విద్యార్థులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో జరుగుతున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కి చెందిన 300 మంది రోవర్లు, రేంజర్లు సేవలందించారు. శివరాత్రి రోజున ఆలయానికి విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులను క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. అలాగే మంచినీరు, మజ్జిక, బిస్కెట్లు, చిన్నపిల్లలకు పాలు వంటివి పంపిణీ చేశారు. దివ్యాంగులకు సహాయంగా వెళ్లి దర్శనం చేయించారు. ఆలయంలో తప్పిపోయిన చిన్నపిల్లలను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేందుకు తమ వంతుగా సహాయ పడ్డారు. రథోత్సవం, తెప్పోత్సవాలు, కల్యాణోత్సవాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లలో పోలీసులకు తోడ్పాటునందించారు. శ్రీకాళహస్తిలోని మహిళా డిగ్రీ కళాశాల, కడపకు చెందిన శ్రీహరి డిగ్రీ కళాశాల, అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన 300 మంది రోవర్ లీడర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలందించారు. జిల్లా కార్యాలయ కమిషనర్ టి.రమేష్ బాబు ఆధ్వర్యంలో యూత్ చైర్మన్ అజారుద్దీన్, రేంజర్ లీడర్ ఎంవీ జ్యోతిర్మయి, రోవర్ లీడర్లు కె.ఆంజనేయులు, స్కౌట్ మాస్టర్లు మహేంద్ర, సుబ్రహ్మణ్యం, విద్యాసాగర్, ధనుష్, అభిరామ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నాగలాపురం: జాతీయ మహిళా దినోత్సవంలో బేటీ బచావో -భేటీ పడావో భాగంగా మొదటి రోజు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో బీరకుప్పం హైస్కూల్‌లో కిశోరి బాలికలకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు బాల్యవివాహం సాంఘిక దురాచారమని చెప్పారు. 18 సంవత్సరాలు నిండకుండా బాలికలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాహం చేయరాదని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి బాలిక ఒక రోల్ మోడల్‌గా ఎదగాలని, పురుషులతో సమాన అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకే బాల్య వివాహాన్ని నిర్మూలిద్దం అనే నినాదాలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీహరి, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమంతు వాహనంపై వెంకన్న కటాక్షం



హనుమంతు వాహనంపై శ్రీనివాసుడు

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలోని టీటీడీ అనుబంధాలయమైన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి హనుమంతు వాహనంపై ఆసీనులై మాడవీధుల్లో విహరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి అమ్మవార్లకు కర్పూర హారతులు ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. భక్తులు అడుగడుగునా స్వామి అమ్మ వార్లకు నీరాజనాలు పలికారు. సాయంత్రం ఆలయ అర్చకులు ఆలయంలో స్వామి అమ్మవార్ల ఊంజల సేవ శోభాయమానంగా నిర్వహించారు. అనంతరం రాత్రి శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారు నాలుగు మాడవీధుల్లో విహరించారు. అనంతరం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ఏకాంత సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం ఉంటుంది. రాత్రి గరుడ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు

రేణిగుంట: నాటుసారా తయారు చేసి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ తిరుపతి అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఈ.వాసుదేవ చౌదరి హెచ్చరించారు. శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరు గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానికులకు నాటుసారా, అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ, ఎస్టీలపై ఇతర కులాల వారు కుల వివక్ష చూపితే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం మండలంలోని పెద్దపాలేడు గ్రామపంచాయతీ పరిధిలోని మూలబొందల ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు వారికి ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్రవర్ణాల వారు ఎస్సీ, ఎస్టీలను చిన్న చూపు చూడకూడదని, అలా చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వివక్షకు గురైతే తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, వీఆర్ఓలు, గ్రామ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.